వణికిస్తున్న విషజ్వరాలు

- ఇటీవల డెంగీతో చిన్నారి మృతి
- భయాందోళనలో ప్రజలు



బండపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెద్దేముల్: పల్లెల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ముప్పేట దాడి చేస్తుండగా.. వాటితో పాటు అంతుచిక్కని రోగాలు చుట్టుముట్టగా.. తట్టెపల్లి, బండపల్లి గ్రామాల ప్రజలు మంచాన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో నిత్యం రద్దీగా ఉంటున్నాయి. మూడు రోజుల క్రితం పెద్దేముల్ మండల బండపల్లి గ్రామానికి చెందిన పవిత్ర (12) డెంగీతో మృతి చెందగా.. స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

లోపించిన పారిశుద్ధ్యం

'గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయి. మురుగు నీరు రోడ్లు, వీధుల్లో ప్రవహిస్తున్నాయి' అని స్థానికులు చెబుతున్నారు. అపరిశుభ్రతతో దోమ కాటు బాధితులు పెరుగుతున్నారని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబును వివరణ కోరగా.. పవిత్ర అనే బాలిక డెంగీతో మృతి చెందిన విషయం వాస్తవమేనని, త్వరలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



ఆసుపత్రి సమీప రోడ్డుపై ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం ఈ చిత్రం. ఇందులో కనబడే మ్యాన్‌హోల్.. జిల్లా కేంద్రం వికారాబాద్ ప్రధాన రహదారిలో ఉంది. పక్కనే ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆస్పత్రి, మరో పక్క ఆర్టీసీ బస్టాండ్, ఓ ప్రైవేటు పాఠశాల, రెండు బ్యాంకులు ఉన్నాయి. ఇక్కడికి అనేకమంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఇంత రద్దీ ప్రాంతంలో ఉన్న ఈ మ్యాన్‌హోల్ వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనదారులు, బాటసారులు గుర్తించేందుకు కర్రలు ఏర్పాటు చేశామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్

- తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- తహసీల్దారు వెంకటేశ్



ఎన్నికల నియమావళిని వివరిస్తున్న తహసీల్దారు

బొంరాస్‌పేట: శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దారు వెంకటేశ్ అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బూత్‌లెవల్ సిబ్బందితో ఎన్నికల కోడ్ గురించి చర్చించారు. గోడలపై రాజకీయ పార్టీల గుర్తులు, పోస్టర్లు, రాతలు, నాయకుల పేర్లను తుడిచివేయాలని, కటౌట్లు, ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా ఓటరు జాబితా, బూతుస్థాయిలో వివరాలను సరిచూసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వీరప్ప



వీరప్పకు నియామక పత్రం అందజేస్తున్న జగన్ మోహన్‌రావు

పెద్దేముల్: ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గాజీపూర్ గ్రామానికి చెందిన (సర్పంచ్) తలారీ వీరప్ప ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు నియామక పత్రం అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వీరప్ప మాట్లాడారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. మత్స్యకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బస్సయ్య, చెర్ల రాములు, బీవీఎస్ఎస్ మండల కార్యదర్శి రాములు, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీరామ్

- చట్టాలపై అవగాహన తప్పనిసరి
- మున్సిఫ్‌కోర్టు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శ్రీరామ్

కొడంగల్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మున్సిఫ్ కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి శ్రీరామ్ సూచించారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వలన జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, మహిళలకు ఆస్తిలో సమానవాటా, 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని చెప్పారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు కృషిచేయాలన్నారు. ఇందులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, ఎంఈఓ రాంరెడ్డి, న్యాయవాదులు బస్వరాజ్, రమేష్, కృష్ణ, రవీందర్‌నాయక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థికి సన్మానం



పవన్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పరిగి: కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన కిష్టమ్మగుడితండాకు కేతావత్ పవన్‌కళ్యాణ్‌ను బుధవారం బీజేపీ నాయకులు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడారు. పోలీసు ఉద్యోగం అంటే సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో పేరుప్రఖ్యాతులు పొంది, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇందులో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, జిల్లా కార్యదర్శి పెంటయ్య, మండల అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు హరికృష్ణ, బాలకృష్ణ, యాదయ్య ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ పట్లూర్ గ్రామ నూతన కమిటీ అధ్యక్షుడిగా ముక్తూత్ చావీస్‌ను ఆ పార్టీ గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్ వివరాలు వెల్లడించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకాశ్, యూత్ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్ ముదిరాజ్, బీసీసెల్ అధ్యక్షుడిగా పాండు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అయాజ్, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాకేశ్, ఎంపీటీసీ మంజుల, మాజీ ఎంపీటీసీ రాజు, మాజీ ఉప సర్పంచ్ బషీర్, నాయకులు మహేశ్, బైనగాని సునీల్, అంజయ్య తదితరులు ఉన్నారు.



బతుకమ్మలతో విద్యార్థినులు

ఘనంగా బతుకమ్మ

అనంతగిరి: వికారాబాద్ పట్టణం సెయింట్ జూడ్స్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు బతుకమ్మలు పేర్చి, ఆటపాటలతో అలరించారు. అనంతరం బతుకమ్మ విశిష్టతను ప్రిన్సిపాల్ తెలిపారు.

వాహనాల తనిఖీ

అనంతగిరి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమంగా డబ్బు, మద్యం తరలింపును అరికట్టేందుకు పోలీసులు వాహనాల తనిఖీలు విస్తృతం చేశారు. బుధవారం హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై బ్రిడ్జి సమీపంలో సీఐ శ్రీను ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి ఒకేచోట వాహనాలను సోదా చేశారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

గట్టెక్కిన కర్షకుల కష్టాలు

- ప్రకృతి వైపరీత్యాల నుంచి దిగుబడిని కాపాడుకునేందుకు గోదాం నిర్మాణం
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు



దౌల్తాబాద్: రైతులు పండించిన పంటను ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుకునేందుకు, నిల్వ ఉంచుకునేందుకు ప్రభుత్వం గోదాంలను నిర్మించి వినియోగంలోకి తెచ్చింది. మండల కేంద్రంలో రూ.1.87కోట్లతో 2,500 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంచే గిడ్డంగిని నిర్మించి ఇటీవలే అందుబాటులోకి తెచ్చారు. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తంచేశారు. దిగుబడులను ఎంతకాలమైనా దాచుకునేందుకు అనువైన స్థలాన్ని కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

తొలగిన ఇక్కట్లు

గతంలో గోదాంలు లేక చేతికొచ్చిన దిగుబడిని ఎక్కడ నిల్వ చేయాలో అర్థంకాక రైతులు ఇబ్బంది పడేవారు. ధాన్యం విక్రయించే వరకు వర్షం బారిన పడకుండా కాపాడుకునేందుకు నానా ఇక్కట్లు పడేవారు. రోడ్లపై గింజలు రాశులు పోసి రేయింబవళ్లు కాపాలా కాసేవారు. ఇలా ఎన్నో కష్టనష్టాల కోర్చిన కర్షకులకు గోదాలం నిర్మాణంతో మునుపటి ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. అంతే కాకుండా గోదాం నిర్మాణంతో ప్రత్యక్షంగా సుమారు 50నుంచి 80 మంది వరకు ఉపాధి లభించనుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

నష్ట నివారణ



గతంలో వర్షాలు, ఈదురుగాలులతో చేతికొచ్చిన దిగుబడిని రైతులు కోల్పోయేవారు. అగ్ని ప్రమాదాల వలన పంట నష్టం జరిగేది. మండల కేంద్రంలో 2500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు ప్రభుత్వం గోదాం నిర్మించింది. దీంతో రైతుల ఇబ్బందులు తొలగిపోయాయి.

– నర్సింహులు, పీఏసీఎస్ డైరెక్టర్

రైతుల కోసమే..



అన్నదాతలు పండించిన పంటను కాపాడుకునేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో ప్రభుత్వం గోదాం నిర్మించింది. గిడ్డంగి వినియోగంతో ఇక్కడి రైతులకు ఎంతో మేలు జరిగింది.

– వెంకట్‌రెడ్డి, చైర్మన్, పీఏసీఎస్

ఇందిరమ్మ రాజ్యంతో రాష్ట్రం సుభిక్షం

కేశంపేట: ఇందిరమ్మ రాజ్యంతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధి పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరించారు. పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.2,500 ప్రతి నెల అందిస్తామని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లను జాబ్ క్యాలండర్ ప్రకారం అమలు చేస్తామని వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య యాదవ్, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేశ్, గిరియాదవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

16న ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్: కంటి పొర(శుక్లాలు) వచ్చిన వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 16న లయన్స్ క్లబ్, జిల్లా కలెక్టర్, చైర్మన్, అంధత్వ నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామన్నారు. కంటి పరీక్ష అనంతరం కంటిలో శుక్లాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే ఎనుగొండ కందూరు రాంరెడ్డి కంటి వైద్యశాలకు తీసుకెళ్తామని, ఆపరేషన్ తరువాత తిరిగి కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి ఉచితంగా చేర్చనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలు, మందులు, భోజనం, రవాణా ఖర్చులు ఉచితమేని వివరించారు. వైద్య పరీక్షకు వచ్చేవారు ఆధార్, రేషన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డుల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్ 94411 78379ను సంప్రదించాలని చెప్పారు.

బీఆర్ఎస్‌ది అవినీతి పాలన

- కాంగ్రెస్‌ను ఆదరించి, అభివృద్ధిని ఆస్వాదించండి
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు



ధారూరు: గ్యారంటీ పథకాలను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు/దోమ: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగు చెందారని, తెలంగాణలో కొనసాగుతున్న కల్వకుంట్ల కుటుంబ పాలనకు చరమగీతం పాడి, కాంగ్రెస్‌ను ఆదరించి, అభివృద్ధిని ఆస్వాదించాలని పలువురు కాంగ్రెస్ నేతలు కోరారు. ఇంటింటి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆ పార్టీ శ్రేణులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. పథకాల గురించి వివరించారు.

ధారూరులో..

ధారూరు మండల కేంద్రంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ తిరిగారు. గ్యారంటీ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతోందని, రాష్ట్రాన్ని దోచుకుతింటుందని ఆరోపించారు. తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, లింగనపల్లి అశోక్, తిరుపతిగారి మల్లేశం, బోయిన అంజయ్య, దుబ్బ సుధాకర్ ఉన్నారు.

దోమలో..

రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ దోమ మండలం అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. మైలారం గ్రామంలో యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా హన్మంతు, సోషల్ మీడియా కన్వీనర్‌గా రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రాములునాయక్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు రమేష్ గౌడ్, గోవర్ధన్, రత్నయ్య, మహేశ్, వెంకటయ్య ఉన్నారు.

మలుపు ప్రమాదానికి పిలుపు

ఆదమరిస్తే అంతే..

బంట్వారం: కోట్‌పల్లి మండలం కొత్తపల్లి పంచాయతీ రాజ్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏ మాత్రం ఆదమరచినా ఆసుపత్రి పాలవడం ఖాయమని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుల్తాన్‌పూర్‌కు వెళ్లే ఈ మార్గంలో రెండు చోట్ల రోడ్డు భారీగా మలుపు తిరిగి ఉంది. ఒక చోట పూర్తిగా యు ఆకారంలో ఉండగా.. చెరువు దగ్గర మూల మలుపు డేంజర్ బెల్ మోగిస్తోంది. చెరువు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంచెలు, పొదలు దగ్గరగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రెండు మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు అసలే కనిపించవు. దూరం నుంచి హారన్ మోగిస్తే కాని వాహనాలు వస్తున్నాయన్న విషయం తెలియదు. ఇప్పటికే పలువురు ఈ ప్రదేశాల్లో ప్రమాదాల బారిన పడ్డారు. విషయం తెలిసినా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని, కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



యు ఆకారంలో కొత్తపల్లి రోడ్డు

క్లుప్తంగా

18న ఆటాపాట



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కుల సంఘాల నాయకులు

తాండూరు టౌన్: బహుజన బతుకమ్మ సంబురాల పోస్టర్‌ను బుధవారం తాండూరులో పలు కులసంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 18న రేగడి మైలారంలో జరగనున్న ఉత్సవాలకు బహుజనులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. బహుజనులకు, మహిళలకు సామాజిక న్యాయం జరగాలనే ఉద్దేశంతో బహుజన కుల సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో నాయకులు వెంకటేశ్, బలరాం, శ్రీనివాస్, అశోక్, నర్సింహులు, వెంకటయ్య, వినోద్, రమేష్ ఉన్నారు.

19న బహిరంగ వేలం

అనంతగిరి: కార్తీక మాసం పెద్ద జాతర సందర్భంగా అనంతగిరి దేవాలయం వద్ద కొబ్బరి కాయలు, దీపారాధన సామగ్రి విక్రయించేందుకు గాను ఈనెల 19న ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు వేలం జరుగుతుందన్నారు. కొబ్బరికాయల విక్రయానికి రూ.లక్ష, దీపారాధన సామగ్రికి రూ.10వేలు డిపాజిట్ చేయాలని చెప్పారు. హక్కులు పొందిన వారు నవంబర్ 14 నుంచి డిసెంబర్ 13 వరకు విక్రయించుకోవచ్చునని తెలిపారు. హక్కులు పొందని వారికి డిపాజిట్ వాపసు చేయబడుతుందన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

31వరకు ఓటరు నమోదు

పెద్దేముల్: కొత్తగా ఓటరు నమోదుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని, మీ–సేవలో దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీఎల్‌ఓలతో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా ఓటరు చనిపోతే ఉంటే గుర్తించాలని పేర్కొన్నారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ అవినాష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను ప్రచారాలకు వాడొద్దు

దౌల్తాబాద్: ఎన్నికల నియమావళి నేపథ్యంలో నిబంధనలకు అతిక్రమించి అక్రమంగా నగదుతో ప్రయాణించడం నేరమని, నిబంధనల ప్రకారం ప్రజలు నడుచుకోవాలని ఎస్ఐ రమేష్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ విషయంలో అన్ని పార్టీలు సమయస్ఫూర్తితో నడుచుకోవాలని, ప్రభుత్వ వాహనాలను పార్టీల ప్రయోజనాలకు ఉపయోగించరాదని చెప్పారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీల పోస్టర్లు, బ్యానర్లు వేయరాదని, ప్రచారానికి ఉపయోగించరాదని ఆదేశించారు.

రాజీనామా ఉపసంహరణ

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలం దుద్యాల–2 ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు ఎల్లప్ప తన రాజీనామాను బుధవారం ఉపసంహరించుకున్నారు. వ్యక్తిగత కారణాల వలన పార్టీ, పదవి నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పగా.. పార్టీ నియోజకవర్గ నేత పట్నం నరేందర్‌రెడ్డి సముదాయించడంతో.. రాజీనామా లేఖను వెనక్కి తీసుకున్నట్లు ఎల్లప్ప పేర్కొన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: చెరువుముందలి తండా(ఏ) గ్రామ పంచాయతీకి చెందిన జమ్ములమ్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి స్థానిక నేతల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. ఇందులో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు విఠల్ నాయక్, శ్రీనివాస్ నాయక్, శంకర్ నాయక్, రాజునాయక్ ఉన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి

కొడంగల్ రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ భరత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రక్రియ జరగాలన్నారు.

డీటీగా నర్సింహులు



అధికారులను సన్మానిస్తున్న నేతలు

దోమ: డిప్యూటీ తహసీల్దార్‌గా నర్సింహులు, గిర్దావరిగా సుదర్శన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక నేతలు వారిని సన్మానించారు. రెవెన్యూ పరమైన అంశాలలో రైతులకు అండగా నిలవాలని కోరారు. షాద్‌నగర్‌లో గిర్దావరిగా పనిచేసిన నర్సింహులు పదోన్నతిపై ఇక్కడికి డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. పెద్దేముల్‌లో గిర్దావరిగా పనిచేసిన సుదర్శన్ దోమకు బదిలీ అయ్యారు.